సాక్షి ఒడిశా

బుధవారం । 12 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,78,842లు, బంగారం 850 మిల్లీగ్రాములు, వెండి 59 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



శాసనసభలో క్రమశిక్షణ చర్యలు

రాష్ట్ర శాసనసభలో క్రమశిక్షణ రాహిత్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.

- 8లో



పునర్విభజనను వ్యతిరేకిద్దాం

వివాదస్పదమైన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిద్దామని రాష్ట్రంలోని విపక్ష నేతలను తమిళనాడులోని డీఎంకే పార్టీ నాయకులు మంగళవారం కలిశారు.

- 8లో

న్యూస్‌రీల్

బీఈవో కార్యాలయం వద్ద ఆందోళన



నిరసన తెలుపుతున్న ప్రజలు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్ర సమితి లిమ్మ గ్రామ పంచాయతీ కుసుమగుడ గ్రామంలో ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని బదిలీ చేసినందుకు బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి(బీఈవో) కార్యాలయం వద్ద గ్రామస్తులు నిరసన తెలిపారు. కార్యాలయంలో బీఈవో లేకపోవడంతో అక్కడి ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 8వ తరగతి వరకు 127 మంది విద్యార్థులు చదువుతుండగా కేవలం 5 మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వారిలో మరో ఉపాధ్యాయుడిని బదిలీ చేయడం సరికాదన్నారు. అధికారులు స్పందించి బదిలీ నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు త్రినాథ్ జాని, సభ్యులు తులమని మొసిహ, భగవాన్ ఖుడిపియ, గౌరీశంకర పొరజ, రీణ పంగి, లక్ష్మణ ఖుడిపియ, సురేష్ బారిక్, శ్రీధర పొరజ, ప్రతిమ జాని, గుప్త బారిక్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

జయపురం: సమితిలోని మహుళభట్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైందని సదర్ పోలీసు అధికారి సచిన్ ప్రధాన్ వెల్లడించారు. వృద్ధుడు తెల్లని చారల చొక్కా వేసుకున్నాడని, ఒక ఎర్రని గావంచ ఉందని వెల్లడించారు. మృతదేహాన్ని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అతడి వయస్సు 65 ఏళ్లు ఉండవచ్చని, గుర్తించినవారు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



ఇసుక ట్రాక్టర్‌తో పట్టుబడిన నిందితులు

జయపురం: ఒక ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను జయపురం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైనవారు జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి లిమా గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ భగవాన్ ఖెంధు, కుంద్ర సమితి ఘివురియగుడ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని భాస్కర బిశాయిలుగా సదర్ పోలీసు అధికారి జచింద్ర ప్రధాన్ వెల్లడించారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సదర్ పోలీసులు జయపురం సమీప భూతనాథ్ మందిరం వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో జయపురం వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపి సీజ్ చేశారు. నిందితులు కుంద్ర సమీపంలోని ఒక నది నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు. ఎస్‌ఐ రాజ కిశోర్ బారాక్ కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు తరలించారు.


నాటుసారా అమ్మకాలు నివారించాలి



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి పూజారిపుట్ పంచాయతీ కొండగుడ గ్రామంలో నాటుసారా అమ్మకాలు నివారించాలని గ్రామస్తులు పోలీసులకు వినతిపత్రం మంగళవారం అందజేశారు. నాటుసారా అమ్మకాల వలన గ్రామంలోని కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని పురుషులు, మహిళలు సారా తాగుతుండడం వలన అకాల మరణాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే అమ్మకాలు నిలిపివేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు త్రినాథ్ భూమియ, ఖగపతి పూజారి తదితరులు పాల్గొన్నారు.





ఎస్ఎస్ఎంబీ-29 పోస్టర్



పుష్ప-2 షూటింగ్ సమయంలో దర్శకుడు సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

స్టార్ట్.. కెమెరా.. యాక్షన్..!

- కొరాపుట్ జిల్లాలో తెలుగు సినిమాల షూటింగ్స్
- సందడి చేస్తున్న అగ్ర హీరోలు
- పెరిగిన పర్యాటకుల తాకిడి

ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్నటువంటి కొరాపుట్ జిల్లా నేడు సినిమా షూటింగ్స్‌తో సందడిగా మారింది. 15 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు దేశ ప్రజల దృష్టిని ఆకర్షించేవి. అయితే ప్రస్తుతం అంతా మారిపోయింది. ప్రకృతి అందాలకు ప్రసిద్ధిగాంచిన ఈ ప్రాంతం సినీ తారల ఆటపాటలతో కళకళలాడుతోంది. దీంతో ఒకప్పుడు ఈ ప్రాంతానికి బదిలీపై రావాలంటే భయపడిన అధికారులే నేడు బదిలీకి ముచ్చటపడుతున్నారు. లక్షలాది మంది దేశ, విదేశీయులు విహార యాత్రలకు కోసం తరలివస్తున్నారు. – కొరాపుట్



ఇప్పటివరకు చిత్రీకరణలు

ఈ ప్రాంతంలో ఇదివరకే ప్రముఖ చిత్రాలు షూటింగ్ జరుపుకున్నాయి. పుష్ప–2 సినిమాను పక్కనే ఉన్న మల్కన్‌గిరి జిల్లాలో అత్యధిక భాగం షూటింగ్ చేవారు. ఇటీవల సూపర్‌హిట్‌గా నిలిచిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాని కొరాపుట్ జిల్లాలోనే చిత్రీకరణ చేశారు. అప్పట్లో వేంకటేష్ తదితర నటులు ఈ ప్రాంతంలో పర్యటించారు. అనుష్క ప్రధాన పాత్రలో నటించిన ఘాటీ సినిమా కొరాపుట్ జిల్లాలోనే అత్యధిక భాగం షూటింగ్ జరుపుకుంది. ఈ సినిమా ఏప్రిల్ 18న ప్రజల ముందుకు రానుంది. ఈ సినిమా జయపూర్ మెయిన్ రోడ్డు మీద షూటింగ్ చేయడం గమనార్హం.

తప్పని లీకుల గోల


రాజమౌళి బృందం పటిష్ట చర్యలు తీసుకుంటున్నప్పటికీ లీకుల బెడద తప్పడం లేదు. మహేష్‌బాబుని విలన్ అనుచరులు నెట్టుకుంటూ వస్తుండగా, విలన్ వీల్ చైర్ మీద ఉండడం, మహేష్ బాబు అక్కడకి చేరడం వంటి వీడియోలు లీకయ్యాయి. ఇవి కొరాపుట్ జిల్లాలో, సోషల్ మీడియాలో ఆదివారం వైరల్ అయ్యాయి. ఒక వ్యక్తి సందర్శకుడి మాదిరిగా వచ్చి కారులో కూర్చుని ఈ వీడియో తీసి వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేసినట్లు తెలుస్తోంది.

భారీ భద్రత

రోజురోజుకీ సందర్శకుల తాకిడి పెరుగుతుండడంతో ప్రభుత్వం ఇక్కడ ప్లాటూన్ పోలీసులను మోహరించింది. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు సుమారు 80 మంది భద్రతా ఏర్పాట్లలో మునిగి ఉన్నారు. ఇప్పటికే మహేష్ బాబు, మళయాల విలన్ పృథ్వీరాజ్ కరుణాకరణ్‌లు చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఇంకా హిందీ నటులు ప్రియాంక చోప్రా, జాన్ అబ్రహాంలు రావాల్సి ఉంది. ఒడిశా ప్రభుత్వం కూడా సినిమా నిర్మాణానికి పూర్తి సహకారం అందజేస్తోంది. తద్వారా ఈ ప్రాంతం పర్యటక రంగంలో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షిస్తోంది.

ప్రముఖుల హర్షం

ప్రస్తుతం రాజమౌళి సినిమా బృందం సందడి చేస్తుండడంపై రాజకీయ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ శాసన సభాపక్ష నాయకుడు రాం చంద్ర ఖడం మాట్లాడుతూ.. తెలుగు సినిమా ఇండస్ట్రీ తమ ప్రాంతంలో షూటింగ్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అవసరమైతే తాము పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. మరిన్ని తెలుగు సినిమాలు ఇక్కడ షూటింగ్ చేయాలని కోరారు. బీజేడీకి చెందిన కొరాపుట్ జిల్లా పరిషత్ ప్రెసిడెంట్ సస్మితా మెలక మాట్లాడుతూ.. రాజమౌళి బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి సినిమాలు ఈ ప్రాంతంలో తీయడం వలన స్థానికులకు ఉపాధితో పాటు ఆదాయం వనరులు పెరుగుతాయన్నారు.



షూటింగ్ స్పాట్‌లో సూపర్ స్టార్ మహేష్‌బాబు



కొరాపుట్‌లో చిత్రీకరణ చేసుకున్న సంక్రాంతికి వస్తున్నాం

రాజమౌళి షూటింగ్ షురూ

పాన్ ఇండియా దర్శకుడు రాజమౌళి కొద్దిరోజుల క్రితం సామాన్య వ్యక్తి మాదిరిగా విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో వస్తూ ఈ ప్రాంత అందాలను తిలకించారు. దీనిలో భాగంగా కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో స్టే చేశారు. ఇక్కడి అందాలను గమనించి తాను ప్రస్తుతం సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో చేస్తున్న సినిమా షూటింగ్ షురూ చేశారు. దీంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. ప్రస్తుతం సిమిలిగుడ ప్రాంతంలోని హోటళ్లలో గదులు దొరకడం లేదు. ఆంధ్ర సరిహద్దు సాలూరుకి కూతవేటు దూరంలో దేవమాలి పర్వతంపై ఈ సినిమా తీస్తున్నారు. అందువలన ప్రతిరోజూ ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి వందలాది మంది అభిమానులు తారలను చూసేందుకు తరలి వస్తున్నారు.



ఘాటీ సినిమాలో అనుష్క

హాస్టల్ సూపరింటెండెంట్ సస్పెన్షన్



అన్వేష హాస్టల్



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహరో

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న అన్వేష హాస్టల్‌లో విద్యార్థిపై తోటి విద్యార్థుల మూకుమ్మడి దాడిపై జిల్లా యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు హాస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రస్మిత సాహుపై సస్పెన్షన్ వేటువేసింది. అదేవిధంగా హాస్టల్‌లో వంటలు చేసే మరో ముగ్గురిని విధుల నుంచి తొలగించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆసీమారావ్ ఆదివారం హాస్టల్‌కు వెళ్లి దర్యాప్తు చేపట్టి జిల్లా యంత్రాంగానికి నివేదిక సమర్పించింది. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహరో మరోసారి సోమవారం హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. అలాగే హాస్టల్ నుంచి తొమ్మిది మంది విద్యార్థులను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. వీరిలో 8 మంది విద్యార్థుల అనుచిత ప్రవర్తనపై జిల్లా అదనపు సంక్షేమ శాఖ అధికారి గంగాధర్ బెహర గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పెళ్లి పీటలెక్కనున్న మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి



సుశ్రీ సంగీతాతో మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ, బీజేడీ నాయకుడు ప్రదీప్ మజ్జి వివాహం బుధవారం జరగనుంది. గోవాలోని పనాజీలో తన వివాహం జరుగుతుందని ఆయన స్వయంగా ప్రకటించారు. జర్నలిస్ట్ సుశ్రీ సంగీతా సాహుని ప్రేమ వివాహం చేసుకోనున్నారు. వీరిద్దరికీ భువనేశ్వర్‌లోని జిమ్‌లో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది.

9 నెలల్లో రూ.21,000 కోట్ల రుణం

- సీఎం మోహన్‌చరణ్ మాఝి



భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ రుణ భారం 9 నెలల స్వల్ప వ్యవధిలో రూ.21,000 కోట్లు పైబడిందని సీఎం మోహన్‌చరణ్ మాఝి రాష్ట్ర శాసనసభకు తెలియజేశారు. గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నాటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.21,177.99 కోట్లు అప్పుగా తీసుకుందన్నారు. ఈ నిధులను మౌలిక సదుపాయాలు మరియు సంక్షేమ పథకాల అమలు, కార్యాచరణ కోసం వినియోగించినట్లు పేర్కొన్నారు. బహుళ వనరుల నుంచి ఈ అప్పు తీసుకున్నట్లు ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న సీఎం వెల్లడించారు. విపక్ష బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే గౌతమ్ బుద్ధ దాస్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ విషయాలు వెల్లడించారు.

రూ.9,000 కోట్ల ఓపెన్ మార్కెట్ రుణాలు

అత్యధికంగా రూ.9,000 కోట్లు ఓపెన్ మార్కెట్ రుణాలు తీసుకున్నట్లు సీఎం మోహన్‌చరణ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.7,149.56 కోట్ల రుణం లభించిందన్నారు. ఒడిశా మినరల్ బేరింగ్ ఏరియాస్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.2,750 కోట్లు, రాష్ట్ర పరిహార అటవీకరణ నిధి (క్యాంపా) నుంచి రూ.2,370 కోట్లు, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి జాతీయ బ్యాంకు (నాబార్డ్) నుంచి రూ.2,261.16 కోట్లు, నికర ప్రావిడెంట్ ఫండ్ తగ్గింపుల నుంచి రూ.2,352.73 కోట్లు అప్పుగా సేకరించామన్నారు. ఈ రుణాలను నీటి పారుదల, విద్యుత్, రోడ్లు, విపత్తు నిర్వహణ, పట్టణ మౌలిక సదుపాయాల వంటి మూలధన – ఇంటెన్సివ్ రంగాలకు కేటాయించినట్లు విశ్లేషించారు.

రుణాలు చెల్లించే ప్రయత్నాలు

ప్రజాహిత, పురోగతి లక్ష్యంగా ఆర్థిక వనరులను అప్పుగా సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం పాత అప్పులు తీర్చే దిశలో నిర్మాణాత్మక శైలితో ముందుకు సాగుతోందన్నారు. గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు తొమ్మిది నెలల కాలంలో రాష్ట్రం మునుపటి రుణాలను రూ.14,970.97 కోట్లు తిరిగి చెల్లించిందని తెలిపారు. కొత్త రుణాలను ప్రభుత్వ పథకాల నిర్వహణ కోసం వినియోగిస్తూ.. మరోవైపు రాష్ట్ర ఆదాయంతో పాత అప్పులను తీర్చేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు.

త్వరలో మహిళా కోర్టు ఏర్పాటు

- ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా వెల్లడి

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో పూర్తిస్థాయిలో మహిళా న్యాయస్థానం ఏర్పాటు కానుందని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా తెలిపారు. ఒడిశా ఉమెన్ ఇన్ మీడియా (ఓడబ్ల్యూఎం) ద్వితీయ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రసంగిస్తూ ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. మహిళలపై జరిగే నేరాలను పరిష్కరించడానికి పూర్తిగా మహిళా కోర్టును ఏర్పాటు చేయడం ప్రభుత్వ ఆలోచనగా పేర్కొన్నారు. మహిళలపై అన్యాయాల విచారణలో పారదర్శకతకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసుల విచారణలో వాస్తవాలను బహిరంగంగా న్యాయస్థానంలో వ్యక్తీకరించేందుకు మహిళా న్యాయస్థానాలు ప్రోత్సాహకరంగా పని చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులు వంటి నేరాలకు బలైన బాధిత మహిళలు సాటి మహిళల మధ్య తమకు జరిగిన అన్యాయాన్ని భయం లేకుండా చెప్పేందుకు సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించడమే లక్ష్యమని తెలిపారు. ప్రత్యేక కోర్టులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, గుమాస్తాలు, పరిపాలన సిబ్బంది అందరూ మహిళలే ఉంటారని పేర్కొన్నారు.

శక్తి యాప్ ఆవిష్కరణ

అత్యాచారాలు వంటి భయానక పరిస్థితుల నుంచి ప్రాణాలతో బయటపడినవారికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్ ఆవిష్కరించింది. చట్టపరమైన ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి శక్తి యాప్ బలమైన సోపానంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా పేర్కొన్నారు. ఈ యాప్ ఆధ్వర్యంలో బాధితులు తమ సాక్ష్యాలను డిజిటల్‌గా రికార్డ్ చేయడానికి దోహదపడుతుందన్నారు. ఇలా ముందస్తుగా రికార్డు చేసి పదిలపరిచిన వివరాలను తర్వాత కోర్టులో సాక్ష్యంగా సమర్పించేందుకు వీలవుతుంది. మహిళల భద్రతా సమస్యలను ప్రస్తావిస్తూ మహిళా జర్నలిస్టులు తమ నగరాల్లోని ఏడాది పొడవునా భద్రతా ఆడిట్‌లను నిర్వహించాలని కోరారు. వెనుకబడిన నేపథ్యాల నుంచి వచ్చిన ఔత్సాహిక మహిళా జర్నలిస్టులకు మార్గదర్శకత్వం వహించడానికి మరియు నిపుణుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఒడిశా ఉమెన్ ఇన్ మీడియా (ఓడబ్ల్యూఎం) నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

లోయలో పడి ఇద్దరు మృతి

- ఒడిశాలో దుర్ఘటన
- మృతులు సూదికొండ వాసులు



బుట్ట గంగాధర్ మృతదేహం



సయ్యద్ ఫరీద్ మృతదేహం

పర్లాకిమిడి/కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ అర్సిలింగి ఘాట్ వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండకు చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. సూదికొండకు చెందిన ముగ్గురు కొయంపూర్‌కు వ్యక్తిగత పనిపై వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి లోయలో పడిపోయినట్లు తెలిసింది. ఈ ఘటనలో సూదికొండకు చెందిన సయ్యద్ ఫరీద్ (27) అక్కడికక్కడే మృతిచెందగా, బుట్ట గంగాధర్ (35) గజపతి జిల్లా పర్లాఖిమిడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. గంగాధర్ భార్య బుట్ట సరళకు తీవ్ర గాయాలు కావడంతో బరంపురం పెద్దాసుపత్రికి చికిత్స అందిస్తున్నారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బాధిత కుటుంబాలకు అప్పగించనున్నారు. గారబంద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎత్తిపోతల పథకం సామగ్రి చోరీ


చోరీ జరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఇవే

ఆమదాలవలస రూరల్: రైతులకు సాగునీరం దించేందుకు ఆమదాలవలస మండలం అక్కులుపేటలో బొడ్డేపల్లి రాజుగోపాలరావు వంశధార కుడిప్రధాన కాలువ 20ఎల్ ఎత్తిపోతల పథకం వద్ద చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి కరెంట్ సరఫరా నిలుపుదల చేసి మూడు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి కాయిల్స్, కరెంట్ ఆయిల్ పట్టుకుపోయారు. పాటు అందులో ఉండే కరెంట్ ఆయిల్ అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న రైతులు, శ్రీనివాసచార్యులుపేట సర్పంచ్ గౌరిపతి ఆమదాలవలస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎస్ బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ కమిటీ ఏర్పాటు


బుడుమూరు సూర్యారావు

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం కోసం జిల్లా, డివిజన్ కన్వీనర్లను నియమిస్తున్నట్లు ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మంగళవారం ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా విద్యావేత్త బుడుమూరు సూర్యారావును నియమించారు. ఈయన ప్రస్తుతం బూర్జ మండల ఉపాధ్యక్షునిగా ఉన్నారు. గ్రంథాలయ వ్యవస్థ పట్ల అభిమానం ఉన్నవారినే ఉద్యమ కమిటీలో ఏర్పాటు చేస్తున్నామని, వారి రాజకీయ కార్యకలాపాలతో తమకు సంబంధం లేదని శివప్రసాద్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ కన్వీనర్‌గా విద్యావేత్త డాక్టర్ జామి భీమశంకర్, టెక్కలి డివిజన్ కన్వీనర్‌గా బెండి నర్సింగరావు, పలాస డివిజన్ కన్వీనర్‌గా చాపర వేణుగోపాల్‌ను నియమించారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, న్యాయవాది బొడ్డేపల్లి మోహన్‌రావు, విశ్రాంత లైబ్రేరియన్ డి.గోపాలరావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, విద్యావేత్త శాసనపురి మధుబాబు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.వి.మల్లేశ్వరరావులను సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ నియామకాలపై రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు, కథానిలయం ప్రతినిధి దాసరి రామచంద్రరావు, శ్రీకాకుళ సాహితీ ప్రతినిధులు, కవులు కంచరాన భుజంగరావు, కలమట దాసుబాబు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

పరిశ్రమ వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితం


నిరసన తెలుపుతున్న నారువ పంచాయతీ ప్రజలు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో సరాకా లేబొరేటరీ పరిశ్రమ వ్యర్థ జలాలు బయటకు విడిచిపెట్టి భూగర్భ జలాలు కలుషితం చేస్తున్నారంటూ నారువ పంచాయతీ ప్రజలు మంగళవారం ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గతంలో పైపులైన్లు ద్వారా సముద్రంలో విడిచిపెట్టేవారని, కొన్నాళ్లుగా పరిశ్రమ పక్కనే గెడ్డ, కొండదిబ్బ దిగువ ప్రాంతాల్లో విడిచిపెడుతున్నారని చెప్పారు. వ్యర్థ జలాల కారణంగా ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా వ్యర్థాలు పారబోయడం ఆపకపోతే పోరాటం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో నారువ, అక్కయ్యపాలెం, బోయపాలెం తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుకు ప్రాధాన్యం


శిక్షణ పొందుతున్న అభ్యాసకులు

ఎచ్చెర్ల క్యాంపస్: వచ్చే ఖరీఫ్‌లో జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి తెలిపారు. ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్సుపర్సన్లకు మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 70వేల మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పురుగుల మందులు, రసాయన ఎరువుల రహిత వ్యవసాయం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు, నిపుణులు ఆన్‌లైన్‌లో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు, సిబ్బంది సూర్యనారాయణ, పీఎస్ బాబు పాల్గొన్నారు.

శాసనసభలో క్రమశిక్షణ చర్యలు


గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకుల ధర్నా

- కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి సస్పెండ్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో క్రమశిక్షణ రాహిత్యంపై చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. మంగళవారం సభలో జరిగిన ఒక ఘటన తర్వాత 7 రోజుల పాటు సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సభలో పట్టణాభివృద్ధి శాఖ ప్రశ్నోత్తరాలు జరుగుతున్న సమయంలో అధికార బీజేపీ ఎమ్మెల్యే జయ నారాయణ్ మిశ్రా, కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ మధ్య గొడవ చోటు చేసుకుంది. పరిస్థితి వేడెక్కడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే చేయిచేసేందుకు విఫలయత్నం చేసినట్లు ఆరోపణ. అయితే జయ నారాయణ మిశ్రా మొదట తన కాలర్ పట్టుకున్నట్లు తారా ప్రసాద్ ప్రత్యారోపణ చేశారు.

సభలో గందరగోళం

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం నుంచే ప్రతిపక్ష కాంగ్రెస్, బిజూ జనతా దళ్ ఎమ్మెల్యేలు సభ మధ్యలోకి వచ్చి గందరగోళం సృష్టించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి స్పీకర్ పోడియం ఎక్కడానికి ప్రయత్నించారు. తారా ప్రసాద్ బాహినీపతి, సాగర్ దాస్, రోమాంచ్ రంజన్ విశాల్, యోగేష్ సింగ్, దేవి రంజన్ త్రిపాఠి, మాధవ్ ధాడా, నౌబొ మల్లిక్, అభిమన్యు సెఠి, చక్రమణి కంవర్ అసెంబ్లీ రిపోర్ట్ టేబుల్‌పై నిలబడి నిరసన తెలిపారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన

సస్పెన్షన్ ఉత్తర్వులకు వ్యతిరేకంగా రాత్రంతా శాసనసభ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టనున్నట్లు తారా ప్రసాద్ బాహినీపతి ప్రకటించారు. జరిగిన ఘటనపై వాస్తవాలను పరిశీలించకుండా తనకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టడం అన్యాయమన్నారు. విపక్షంలో ఉంటూ ప్రభుత్వ విధానాల్లో తప్పిదాలను వేలెత్తి చూపుతున్నందున ఇటువంటి చర్యలు చేపట్టారని ఆరోపించారు. బీజేపీ సభ్యుడు జయ నారాయణ మిశ్రా కాలర్ పట్టుకుని విదిలించగా ఎమ్మెల్యే బాబూ సింగ్ తోసివేశారు. ఈ విషయాన్ని స్పీకర్‌కు లిఖితపూర్వకంగా వివరించినా, ఏకపక్ష ధోరణితో తనకు వ్యతిరేకంగా మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వ చీఫ్ విప్ సరోజ్ ప్రధాన్ ప్రతిపాదన మేరకు స్పీకర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

పునర్విభజనను వ్యతిరేకిద్దాం

- బీజేడీ, కాంగ్రెసు నేతలకు డీఎంకే పిలుపు


బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌కు ఆహ్వానం అందజేస్తున్న డీఎంకే ప్రతినిధులు

భువనేశ్వర్: వివాదస్పదమైన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిస్తున్న తమిళనాడులోని డీఎంకే పార్టీ నాయకులు రాష్ట్రంలోని విపక్ష నేతలను మంగళవారం కలిశారు. తమిళనాడు మంత్రి టి.ఆర్.బి.రాజా, ఎంపీ దయానిధి మారన్‌లతో కూడిన ఇద్దరు సభ్యుల డీఎంకే ప్రతినిధుల బృందం స్థానిక నవీన్ నివాస్‌లో ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్, ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివాదాస్పదమైన నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించారు. జనాభా ఆధారంగా మాత్రమే నియోజకవర్గాలను పునర్నిర్మించాలనే కేంద్రం ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ సంయుక్త క్రియా శీలక కమిటీ (జేఏసీ)లో చేరాలని కోరారు.

22న చెన్నైలో సమావేశం

పునర్విభజన ప్రతిపాదనకు వ్యతిరేకంగా రాష్ట్రాలను ఏకం చేయడమే లక్ష్యంగా ఈనెల 22న చెన్నైలో జరగనున్న జేఏసీ సమావేశానికి హాజరు కావాలని డీఎంకే ప్రతినిధుల బృందం ఆహ్వానించింది. బీజేడీ జేఏసీలో చేరుతుందని డీఎంకే నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పునర్విభజన ప్రతిపాదనకు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టుకునేందుకు డీఎంకే ఎన్డీఏలోని పార్టీలతో సహా వివిధ పార్టీలను సంప్రదిస్తోందన్నారు. చెన్నైలో జరగబోయే సమావేశానికి హాజరు కావడానికి అధికారికంగా ఆహ్వానించడానికి సీఎం స్టాలిన్ తరఫున ఇక్కడికి వచ్చినట్లు బృందం వివరించింది. పునర్విభజనతో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పంజాబ్ మరియు ఒడిశాతో సహా పలు రాష్ట్రాలు ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


పర్లాకిమిడి: మాట్లాడుతున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్ తదితరులు


మల్కన్‌గిరి: సమావేశానికి హాజరైన మహిళలు

పర్లాకిమిడి: మహిళల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో జిల్లాస్థాయి లక్షాధిపతి దిద్దీల వర్క్‌షాపును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తే కుటుంబాలు బాగుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒడిశా జీవికా మిషన్ అధికారి టిమోన్ బోరా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడీఎం శంకర్ కెరకెటా, అదనపు ఈవో పృథ్వీరాజ్ మండల్, పురపాలక శాఖ కార్యనిర్వహణ అధికారి లక్ష్మణ ముర్ము, జిల్లా సంక్షేమశాఖ అధికారి మనోరమా దేవి తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: స్థానిక మాల్యవంత్ హాస్టల్ ప్రాంగణంలో లక్షపతి దీదీ కార్యశాల కార్యక్రమం కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, మల్కన్‌గిరి సమితి అధికారి తపన్ కుమార్ సేవపతి తదితరులు పాల్గొన్నారు.


పర్లాకిమిడి: కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కార్గో ఎయిర్‌పోర్టును అడ్డుకుందాం


ప్రచార యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: పచ్చని ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఈ నెల 18, 19 తేదీల్లో బాధిత ప్రాంతాలలో చేపట్టనున్న ప్రచార యాత్రను విజయవంతం చేయాలని ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరులో మంగళవారం వామపక్ష పార్టీలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతాన్ని నమ్ముకొని వేలాది మంది ప్రజలు జీవనోపాధి పొందుతుంటే ప్రభుత్వం ఈ ప్రాంతంలో విధ్వంసకర ఎయిర్ పోర్టుతో వారి బతుకులను నాశనం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రజలకు మేలు చేయాలంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ అధ్యక్షుడు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ విజ్ఞాన దినోత్సవ పోటీలు


రొంపివలస బృందానికి బహుమతులు అందజేస్తున్న కాంతారావు, తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవ పోటీలు ముగిశాయి. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో శ్రీకాకుళం, టెక్కలి, పలాస మూడు డివిజన్ల పరిధిలో విజేతలుగా నిలిచిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమిక, సెకండరీ విభాగాల్లో క్విజ్, ఎక్స్‌పెరిమెంట్, సింపోసియం (విశ్లేషణాత్మక చర్చ) అంశాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు, డీఈఓ తిరుమల చైతన్య బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్రీయమైన దృక్పథాలను అలవర్చుకోవాలని, పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అంతకుముందు కార్యక్రమ కో–ఆర్డినేటర్, శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి పోటీలను పర్యవేక్షించారు. వీటి కొనసాగింపుగా జరిగే రాష్ట్రస్థాయి విజ్ఞానశాస్త్ర దినోత్సవ పోటీలు (తేదీలు ఖరారుకాలేదు) శ్రీకాకుళంలోనే జరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి(టెక్కలి)పి.విలియమ్స్, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి, సైన్స్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలు వీరే..

క్విజ్: ప్రాథమిక స్థాయిలో ఎంపీపీ స్కూల్ గంగువాడ, ఎంపీపీ స్కూల్ నందిగాం మెయిన్, ఎంపీపీ స్కూల్ పెద్దలంకాం మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. సెకండరీ స్థాయిలో జెడ్పీహెచ్ స్కూల్ కొయ్యాం, జెడ్పీహెచ్‌స్కూల్ ప్లస్ హరిపురం, జెడ్పీహెచ్ స్కూల్ బోరివంగ తొలి మూడుస్థానాలు సాధించాయి.

ఎక్స్‌పెరిమెంట్: ప్రాథమిక స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో జెడ్పీహెచ్ స్కూల్ కోటబొమ్మాళి, ఎంజేపీ డబ్ల్యూఆర్‌జీ స్కూల్ హయాతీనగరం, జెడ్పీహెచ్ స్కూల్(బోర్డు) నరసన్నపేట మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

సింపోసియం: సెకండరీ స్థాయిలోనే జరిగిన ఈ పోటీల్లో జెడ్పీహెచ్ స్కూల్ రొంపివలస, జెడ్పీహెచ్ స్కూల్ కొనసమాల, జీహెచ్ స్కూల్ కవిటి పాఠశాలలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

ఆమదాలవలస: సంక్షేమం, అభివృద్ధి అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని దుయ్యబట్టారు. సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చకుండా నయవంచన పాలన చేస్తోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.3600 కోట్లు బకాయిలు ఉంటే ఇటీవల బడ్జెట్లో రూ. 2,600 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు నేరుగా వారి ఖాతాలోకి సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు.

- రాష్ట్ర కాళింగ సామాజిక వర్గం అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు (రామారావు)మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై యువత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కూటమి పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ఇటీవల జరిగిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వారి పాలనకు నిదర్శనమన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగే యువతకు పోరుకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆమదాలవలస మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామమూర్తి, పొందూరు మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


ట్రాక్టర్‌తో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు మంగళవారం కుడుములగుమ్మ రహదారిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక మినీ ట్రక్, మరో రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎస్ఐ అజిత్‌సింగ్ బరిహా ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. మొత్తం నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ దీరాజ్ పట్నాయక్ కేసు నమోదు చేశారు.

వనశ్రీ సాధన కేంద్ర భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న వినయ్, బిశ్వజీత్ ద్వివేదీలు

రాయగడ: సదరు సమితి పరిధి రివల్‌కొన గ్రామంలో వనశ్రీ సాధన కేంద్ర భవనం ప్రారంభమయ్యింది. జేకేపూర్‌లోని జేకే పేపర్ మిల్ ఆర్థిక సాయంతో ఈ భవనాన్ని నిర్మించారు. మంగళవారం జేకే పేపర్ మిల్స్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు (వర్క్స్) వినయ్ ద్వివేది, కమర్షియల్ విభాగం ఉపాధ్యక్షుడు బిశ్వజీత్ ద్వివేది తదితరులు హాజరై ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ భవనంలో ఆదివాసీ విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ కల్పిస్తారు.

కొలువుదీరిన అగ్ని గంగమ్మ ఘటాలు


అమ్మవారి ఘటాలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రాయగడ: నీలావడి అగ్ని గంగమ్మ అమ్మవారి జాతరలో భాగంగా అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు కొలువుదీరాయి. అమ్మవారి మందిరానికి సమీపంలోని ప్రత్యేక మండపంలో వీటిని భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేశారు. అమ్మవారి ఘటాలను దర్శించుకున్న అనంతరం, మందిరంలోని అమ్మవారి విగ్రహానికి పూజా కార్యక్రమాలు చేపట్టి, భక్తులు మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. సోమవారం నుంచి ప్రారంభమైన జాతర ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

లక్ష్మీ గణేష్ చిట్స్ యజమానుల ఆస్తుల జప్తు

నరసన్నపేట: నరసన్నపేటలో లక్ష్మీ గణేష్ చిట్స్ సంస్థకు చెందిన యజమానుల ఆస్తులను జప్తు చేస్తూ హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జీఓ నంబరు 46 ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో చిట్ ఫండ్ వ్యాపారి కోరాడ గణేశ్వరరావు, ఆయన భార్య కోరాడ లక్ష్మి, బంధువులు అంధవరపు సూర్యనారాయణమూర్తి, అంధవరపు భారతిల పేరిట ఉన్న ఆస్తులను జప్తు చేస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. స్థానిక కలివరపుపేటలో నివసిస్తున్న గణేశ్వరరావు 2021 జూన్ 30న కుటుంబంతో సహా పరారయ్యాడు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేయగా.. అనంతరం కేసు సీఐడీకి అప్పగించారు. సీఐడీ అదనపు ఎస్పీ రవివర్మ నరసన్నపేటకు పలుమార్లు వచ్చి వివరాలు సేకరించారు. అప్పటి వరకూ తప్పించుకు తిరుగుతున్న గణేష్, భార్య, బంధువులను అరెస్టు చేశారు.తాజాగా ఆస్తుల జప్తుకు ఆదేశాలు జారీ అయ్యాయి.

సీఎం కోసం బీజేడీ సభ్యుల గాలింపు


ముఖ్యమంత్రి చాంబర్ వద్ద బీజేడీ సభ్యుల నిరసన ప్రదర్శన


లాంతర్లతో ముఖ్యమంత్రి కోసం బీజేడీ సభ్యుల గాలింపు

భువనేశ్వర్: శాసన సభలో బడ్జెటు సమావేశాలు హోరాహోరీగా సాగుతున్నాయి. అయితే మరోవైపు గత రెండు రోజులుగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సభలో కనిపించడం లేదు. ఆయన సభా కార్యకలాపాలకు గైర్హాజరవుతున్నారు. దీంతో ఆయన కోసం విపక్ష బిజూ జనతా దళ్ సభ్యులు శాసనసభ అంతా గాలించి నిరసన తెలిపారు. లాంతర్లు చేతబట్టుకుని ముఖ్యమంత్రి కోసం నలుమూలలు గాలించి చివరకు సీఎం చాంబర్ వద్ద బైఠాయించారు. ఈ చర్య రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

కలెక్టరేట్ ముట్టడి


కలెక్టరేట్ వద్ద ఆందోళన జరుపుతున్న ఆశా వర్కర్లు

పర్లాకిమిడి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు కలెక్టరేట్‌ను మంగళవారం ముట్టడించారు. ముందుగా ఒడిశా రాష్ట్ర ఆశా కార్మిక సంఘం, సంయుక్త భారతీయ మజ్దూర్ సంఘ్‌తో కలిసి రాజవీధి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద భారతీయ మజ్దూర్ సంఘ అధ్యక్షుడు సుజిత్ ప్రధాన్ మాట్లాడుతూ.. ఆశవర్కర్ల వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆశా ఫెసిలేటర్లు, బీటీటీ కో–ఆర్డినేటర్లకు ఈపీఎఫ్, రిటైర్‌మెంట్ తర్వాత గ్రాట్యూటీ, మరణిస్తే కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతామని ఆశావర్కర్ల సంఘం అధ్యక్షురాలు కమలా బెహరా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మమతా మహంతి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సహజ రంగులు.. కేరాఫ్ దివ్యాంగులు

- పూలతో పర్యావరణ హితమైన రంగుల తయారీ
- అబ్బురపరుస్తున్న మనోవికాస కేంద్రం దివ్యాంగులు
- 14న హోలీ వేడుకలకు రంగులు సిద్ధం


రంగులను ప్యాకెట్ల రూపంలో సిద్ధం చేస్తూ..


పూలరెక్కలను ఎండబెడుతున్న దివ్యాంగులు

శ్రీకాకుళం కల్చరల్ : రంగుల కేళీ హోలీ పండుగ సమీపిస్తోంది. ఈ నెల 14న జరిగే ఆనందాల వేడుకకు ఇప్పటికే తాత్కాలిక రంగుల దుకాణాలు సిద్ధమయ్యాయి. అయితే రసాయనాలతో తయారుచేసే కృత్రిమ రంగులు కాకుండా పర్యావరణ హితమైన రంగులు వాడాలని పర్యావరణవేత్తలు ఎప్పటి నుంచో విజ్ఞప్తులు చేస్తున్నా అలాంటి రంగులు ఎలా తయారవుతాయో..అవి ఎక్కడ దొరుకుతాయో చాలామందికి తెలియదు. ఈ నేపథ్యంలో రసాయనాలు లేని రంగులు తయారు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు జిల్లా కేంద్రంలో ఉంటున్న బెహరా మనోవికాస కేంద్రంలోని దివ్యాంగులు. అందమైన, పర్యావరణానికి హాని చేయనటువంటి రంగులను స్వహస్తాలతో తయారు చేస్తున్నారు.

పూలరెక్కలతో..

హోలీ రంగులు పర్యావరణానికి హాని చేయకుండా ఉండడానికి రసాయనాలు లేకుండా కేవలం పూల రెక్కలతోనే ఇక్కడ సహజ సిద్ధమైన రంగులు తయారు చేస్తున్నారు. 74మంది మానసిక దివ్యాంగులు ఈ రంగుల రూపకల్పనలో పాలుపంచుకుంటున్నారు. ముందుగా వివిధ రకాల పూల రెక్కలను ఆరబెడతారు. అవి పూర్తిగా ఆరాక రంగుల వారీగా విడదీసి యంత్రంలో వేసి పౌడర్‌గా చేస్తున్నారు. వాటిని చిన్నచిన్న ప్యాకెట్లలో కట్టి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. కేంద్రంలో మానసిక దివ్యాంగులు తయారు చేసిన సహజ సిద్ధమైన రంగులు, ఇతర ఉత్పత్తులతో ఎగ్జిబిషన్ సైతం ఏర్పాటు చేశారు. వీటిని కొనుగోలు చేయడం ద్వారా మానసిక దివ్యాంగులను ప్రోత్సహించిన వారవుతారు.

దివ్యాంగులకు ప్రోత్సాహం



దివ్యాంగుల సృజనకు మా వంతు ప్రోత్సాహం ఇస్తున్నాం. పూలతో సహజ సిద్ధంగా తయారు చేసిన ఈ రంగులు ప్యాకెట్ రూ.30 నుంచి మొదలుకుని సెట్ రూ.150 వరకు విక్రయిస్తున్నాం. దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ఎవరైనా కొనుగోలు చేయాలంటే కేంద్రంలో సంప్రదించవచ్చు.

– శ్యామల, బెహరా మనోవికాస కేంద్రం నిర్వాహకులు, పాత హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీకాకుళం

క్లుప్తంగా

జూడో రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులు

నెల్లిమర్ల: పట్టణంలోని కేజీబీవీ విద్యార్థులు జూడో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ జూడో పోటీలకు జిల్లా నుంచి మహిళల విభాగంలో ఈ పాఠశాలకు చెందిన జె కావ్య, పి పావని, పి జ్యోత్స్న రాణి, ఎస్.ఢిల్లీశ్వరి, కె భార్గవి, బి.దీపిక, సత్య, అనూష, జయలక్ష్మి ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమ తెలిపారు. వారిని పీఈటీ రమణి, ఉపాధ్యాయినులు అభినందించారు.

అంతర రాష్ట్ర ఫెన్సింగ్ క్రీడలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: కేరళలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఫెన్సింగ్ క్రీడలో అంతర్ రాష్ట్ర పోటీలకు పట్టణానికి చెందిన సత్య డిగ్రీ/ పీజీ కళాశాల విద్యార్థి కె.పవన్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఎంపికైన విద్యార్థిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఎకనామిక్స్-1 పరీక్షకు 580 మంది గైర్హాజరు

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎకనామిక్స్ పరీక్షకు 580మంది గైర్హాజరైనట్లు డీవీఈఓ మంజుల వీణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో ఒకేషనల్ పేపర్3, ఎకానమిక్స్-1 పరీక్షకు 9540 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 8,960మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, మాస్‌కాపీయింగ్ జరగలేదని స్పష్టం చేశారు.

30 కేజీల గంజాయి పట్టివేత

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు దుర్గ గుడి వద్ద 30 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, సోమవారం పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో దుర్గ గుడి వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారన్నారు. పట్టుబడిన వారిలో కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మహమ్మద్ షఫీజ్, దివ్యాన్షు శుక్లా, ఓం శుక్లాల నుంచి 30 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

జిల్లా ప్రయాణికుల లోగో ఆవిష్కరణ


లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లా ప్రయాణికుల లోగోను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా ప్రయాణికుల సంక్షేమసంఘం ఈ లోగోను రూపొందించింది. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బడే నాగభూషణరావు, తోటపల్లి ట్రస్ట్ ట్రెజరర్ జి.శ్రీరామచంద్రమూర్తి, డీఆర్‌యూసీసీ సభ్యులు శ్రీహరి, ఏఐ స్టాఫ్ బ్రాండ్ ప్రతినిధి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


గొబ్యాంలో వేతన దారులతో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్

గజపతినగరం రూరల్/దత్తిరాజేరు: గజపతినగరం మండలంలోని పట్రువాడ, చిట్టియవలస, దత్తిరాజేరు మండలంలోని ఇంగిలాపల్లి, గొభ్యాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముక్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఫారం పాండ్‌లు, ఫిష్ పాండ్‌ల నిర్మాణంపై వేతనదారులకు పలు సూచనలిచ్చారు. వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం తక్కువ కాకుండా పనులు కల్పించాలని ఫీల్డు అసిస్టెంట్లను ఆదేశించారు. ఉపాధిహామీ పనులతో సాగునీటి వనరులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట కాలుష్య నియంత్రణాధికారి గోపీచంద్, డ్వామా పీడీ శారదాదేవి, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు ఇస్రో పిలుపు

- అంతరిక్షం.. స్పేస్ అప్లికేషన్‌పై అవగాహన
- 9వ తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- మార్చి 23 వరకు దరఖాస్తుల స్వీకరణ


ఈ తరహా తొమ్మిదవ తరగతి విద్యార్థులు యువికా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై మక్కువ చూపుతూ..నూతన ఆవిష్కరణల పట్ల ఉత్సాహం చూపే విద్యార్థులను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రోత్సహిస్తోంది. యువిక (యుంగ్ సైంటిస్ట్)-2025 పేరిట ఉపగ్రహ ప్రయోగాలను తెలుసుకునేందుకు, శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు 9వ తరగతి విద్యార్థులకు అవకాశం కల్పిస్తోంది.

లక్ష్యాలు..

- భారత అంతరిక్ష పరిశోధనలను విద్యార్థులకు పరిచయం చేయడం
- విద్యార్థులను స్పేస్ టెక్నాలజీ వైపు ప్రోత్సహించడం
- అంతరిక్ష పరిశోధకులుగా వారిని సిద్ధం చేయడం

దరఖాస్తు చేసే విధానం..

ఈ నెల 23వ తేదీలోగా విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తులను పూర్తి చేయాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను ఏప్రిల్ 7వ తేదీనాటికి వడపోసి ఎంపికైన విద్యార్థుల జాబితాలను విడుదల చేస్తారు. మే నెల 18 నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తారు. 19 నుంచి 30వ తేదీ వరకూ యువికా-25 కార్యక్రమం చేపడతారు. మే 31న ముగింపు కార్యక్రమం జరుగుతుంది. అదే రోజు ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ప్రయాణ, భోజన, వసతి ఏర్పాట్లను ఇస్రో పూర్తి ఉచితంగా అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రోజులు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకువెళ్తారు. అక్కడి వింతలు, విశేషాలు, సప్తగహ కూటమి తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారు.

ఎవరు అర్హులు

- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు
- ఆన్‌లైన్ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు
- 8వ తరగతిలో సాధించిన మార్కుల్లో 50 శాతం, మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొంటే వాటి ఆధారంగా 2 నుంచి 10 శాతం, ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో చూపించిన ప్రతిభకు 10 శాతం వెయిటేజీ అందిస్తారు. ఎన్‌సీసీ, స్కౌట్, గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, పల్లె ప్రాంతాలకు చెందిన వారికి 15 శాతం ప్రాధాన్యం కల్పిస్తారు.

భావిశాస్త్ర వేత్తలకు ప్రోత్సాహం



భావిశాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు ఇస్రో చేపడుతున్న యువికా కార్యక్రమాన్ని అర్హతగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. సంబంధిత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పిల్లలకు సహకరించాలి. జిల్లా పరిధిలో డీవీఈఓలు, ఎంఈఓలు ఈ విషయంపై వారి పరిధిలో యంత్రాంగాన్ని చైతన్యపర్చాలి. పెద్ద సంఖ్యలో విద్యార్థులతో దరఖాస్తు చేయించాలి. - ఎన్.తిరుపతినాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

జిల్లావ్యాప్తంగా సంసిద్ధం



గతంలో నిర్వహించిన అనేక సైన్స్ ఎగ్జిబీషన్లు, పోటీ పరీక్షల్లో మన జిల్లా విద్యార్థులు సత్తాచాటి జాతీయ స్థాయిలో వారి ప్రదర్శనలతో అబ్బురపర్చారు. ఇదే స్ఫూర్తితో పెద్ద సంఖ్యలో అర్హత గత విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే 40 వరకూ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేశారు. ప్రస్తుత వేసవి సెలవుల్లో సమయం వృథా కాకుండా ఈ పర్యటనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. - జి.లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

అగ్రవర్ణ పేదలకు స్వయం ఉపాధి మార్గాలు

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల పేదల అభివృద్ధికి స్వయం ఉపాధి పథకం కింద యూనిట్ల స్థాపన, జనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 21నుంచి 60 ఏళ్ల వయస్సు ఉండి దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణ పేదల అభివృద్ధికి స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు, డీ-ఫార్మసీ, బీ-ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత జనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు 21 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారికి సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలను అర్హత మేరకు కేటాయించనున్నట్లు తెలిపారు.

యూనిట్ల స్థాపనకు లక్ష్యాల నిర్దేశం

వెనుకబడిన తరగతుల స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా శ్లాబ్-1, 2,3 కింద 1221 యూనిట్ల స్థాపనకు లక్ష్యాలు నిర్దేశించినట్లు తెలిపారు. ఇందులో యూనిట్ విలువ రూ.2లక్షల నుంచి రూ.5లక్షలు ఉంటుందన్నారు. 50శాతం సబ్సిడీ, 50శాతం బ్యాంకు రుణంతో గరిష్టంగా రూ.75వేల నుంచి రూ.2లక్షల సబ్సిడీ వస్తుందని చెప్పారు. వెనుకబడిన తరగతుల వారు జనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు యూనిట్ విలువ రూ.8లక్షలు చొప్పున 25 యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా అందులో ఒక్కో యూనిట్ విలువలో రూ.4లక్షలు సబ్సిడీ, రూ.4లక్షలు బ్యాంకు రుణం ఉంటుందని వివరించారు. అగ్రవర్ణ పేదలకు స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా ఈబీసీకి 6యూనిట్లు, బ్రాహ్మణులకు 5యూనిట్లు, క్షత్రియ ఒక యూనిట్ కలిపి 12 యూనిట్లను స్థాపించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జనరిక్ ఫార్మసీలో ఈబీసీ, బ్రాహ్మణులకు ఒక్కో యూనిట్ చొప్పున రెండు యూనిట్లతో కలిపి మొత్తం 16యూనిట్లు కేటాయించామని స్పష్టం చేశారు. కాపు కులాల వారికి స్వయం ఉపాధి పథకానికి కేటాయించిన లక్ష్యాలను మూడు శ్లాబ్‌ల్లో 60 యూనిట్లకు రూ.2కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

నమోదు చేసుకోవాలి ఇలా..

అర్హులైన అభ్యర్థులు స్థానిక సచివాలయాలు, ఇంటర్‌నెట్ సెంటర్లలో అభ్యర్థి రేషన్‌కార్డు, రైస్‌కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 22లోగా హెచ్‌టీటీపీఎస్://ఏపీఓ బీఎంఎంఎస్. ఏపీ.సీఎఫ్ ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లను పనిదినాల్లో సంప్రదించాలని సూచించారు.

గ్లకోమా వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: గ్లకోమా(నీటికాసులు) వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి సూచించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి మంగళవారం ఆమె ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్లకోమా అనేది కళ్లకు సంబంధించిన వ్యాధి అని, కంటి డ్రైనేజీ నిర్మాణాలు సరిగా పనిచేయకపోవడం వల్ల కంటి లోపల పీడనం పెరిగి నరానికి హాని కలుగుతుందని తెలిపారు. గ్లకోమా ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు ఉండకపోవచ్చునన్నారు. క్రమంగా చూపు కోల్పోవచ్చునని హెచ్చరించారు. గ్లకోమా బారిన పడిన చాలామందికి తమకు వ్యాధి ఉందని తెలియదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మరింత విజ్ఞానం పెంపొందించుకోవాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


జెండా ఊపి బస్సును ప్రారంభించిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు వెళ్లే విద్యార్థులందరూ తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అభిలాషించారు. జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి బస్సును ప్రారంభించారు. గతంలో జిల్లాలో నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులందరూ తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునేలా విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆర్‌కే బీచ్ వద్ద గల ఐఎన్ఎస్ కుర్సురా సబ్‌మెరైన్ మ్యూజియం, ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం, ఆర్కియాలజీ మ్యూజియంలను సందర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులందరికీ ఆయా ప్రాంతాల్లోని కొత్త విషయాలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని, ఆ విధంగా తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకుని, భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలకు నాంది పలకాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మండలానికి మూడు పాఠశాలలు చొప్పున జిల్లాలోని 15 మండలాల నుంచి 45 మంది విద్యార్థులు ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు బయలుదేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. తిరుపతినాయుడు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఎవెన్యూ ప్లాంటేషన్ పెద్ద ఎత్తున చేపట్టాలి

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: ఎవెన్యూ ప్లాంటేషన్ పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన అటవీ కార్యకలాపాలపై తన చాంబర్‌లో డీఎఫ్ఓ ప్రసూనతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల వెంబడి ఎవెన్యూ ప్లాంటేషన్, చెరువు చుట్టూ ప్లాంటేషన్, గ్రామల్లో చెట్ల పెంపకానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సీడ్ బాల్స్ తయారీకి చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం, వన సంరక్షణ సమితుల ద్వారా ప్లాంటేషన్ పనులు చేపట్టాలని, తాత్కాలిక హోల్డింగ్ ఏరియా ఏర్పాట్ల పనులు చేపట్టడంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. జిల్లాలో చిత్తడి నేలల సరిహద్దులు, వాటి నోటిఫికేషన్‌పై సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

డీకేటీ రైతులకు అన్యాయం..!

- ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో సొంత పట్టాదారులకే నమోదు
- వారికే యూనిక్ ఐడీల కేటాయింపు
- డీకేటీ రైతులకు నమోదు అవదంటున్న అధికారులు
- ఆందోళనలో రైతులు


పార్వతీపురం మండలంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో పాల్గొన్న అధికారులు

ఐటీడీఏ	డీకేటీ రైతులు	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
పార్వతీపురం	12,120	17,528
సీతంపేట	12,135	18,955

పార్వతీపురంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చాయి. రైతులకు ఆ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రస్తుతం వివిధ రకాల పద్ధతులను అవలంబిస్తున్నాయి. అయితే భవిష్యత్‌లో రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల యోజన బీమా, సబ్సిడీ పరికరాలు, పంట నష్టపరిహారం, ఎరువుల రాయితీ, కనీస మద్దతు ధర తదితర పథకాలను అందించేందుకు ప్రత్యేక కార్డులను అందించనున్నారు. ఇందుకోసం అర్హులైన ప్రతి రైతుకు ఆధార్‌కార్డు తరహాలో వ్యవసాయ శాఖ ద్వారా 14అంకెల యూఐడీ కేటాయిస్తున్నారు. అయితే ఇప్పటివరకు సొంత పట్టా భూములు ఉన్న రైతుల వివరాలు మాత్రం నమోదు చేసి ఒక యూనిక్ ఐడీని కేటాయిస్తున్నారు. కానీ డీకేటీ పట్టాలు ఉన్న రైతుల వివరాలు నమోదు చేయడం లేదు. ఇందుకు ఆన్‌లైన్‌లో అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో డీకేటీ రైతులు తమకు పథకాలు, నిధులు అందుతాయో లేదోనన్న ఆందోళనలో ఉన్నారు.

కేవలం పట్టాదారులకే నమోదు చేస్తారా?

జిల్లాలో గల 15 మండలాల్లో గడిచిన రెండు వారాలుగా అన్ని గ్రామాల్లో రైతులకు యూనిక్ ఐడీ నంబర్ కేటాయింపు కోసం వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రైతుల వద్దకు వెళ్లి వారి భూమి పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి యూనిక్ ఐడీ కేటాయిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని రైతుసేవా కేంద్రాల్లో కూడా నమోదు ప్రక్రియ జరుగుతోంది. కానీ డీకేటీ రైతులకు మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు అవడం లేదంటూ చెప్పి పంపించేస్తున్నారు. కేవలం పట్టాదారులకే నమోదు చేస్తారా? అంటూ డీకేటీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో డీకేటీ రైతుల వివరాలు

యూనిక్ ఐడీ కోసం డీకేటీ భూములున్న ఏ ఒక్క రైతుకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వడం లేదు. జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 24,245 మంది రైతులు డీకేటీ పట్టాలు కలిగి ఉన్నారు. రెండు ఐటీడీఏల పరిధిలో 36,483 మంది రైతులు నమోదు కావాల్సి ఉంది. ఆ రైతులందరూ యూనిక్ ఐడీ కార్డులు మాకు ఇవ్వరా? కార్డు ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తే మా పరిస్థితి ఏమిటి అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

అనుమతి వస్తే నమోదు చేస్తాం

ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే, వెబ్‌సైట్‌లో ఆప్షన్ వచ్చిన వెంటనే డీకేటీ రైతుల వివరాలు నమోదు చేస్తాం. ప్రస్తుతం సొంత పట్టాదారులకు సంబంధించి యూనిక్ ఐడీలను అప్‌లోడ్ చేస్తున్నాం. త్వరలోనే అనుమతి వస్తుందని సమాచారం. త్వరలో వారివి కూడా యూనిక్ ఐడీల నమోదు ప్రక్రియ చేపడతాం. - రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, పార్వతీపురం మన్యం

సెరీకల్చర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రతి ఏడాది ప్రాథమిక రంగాలు వృద్ధి సాధించాలని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత శాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సేంద్రియ వ్యవసాయం ఎక్కువగా జరుగుతుందని, సేంద్రియ పంటల రైతులను ప్రోత్సహించాలన్నారు. నిమ్మగడ్డికి మంచి గిరాకీ ఉందని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి రైతులను ప్రోత్సహించాలని కోరారు. వ్యవసాయ పంటల్లో ఏటా 15 శాతానికి మించి వృద్ధి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశుసంవర్థక శాఖాధికారులు కె. రాబర్ట్‌పాల్, బి.శ్యామల, వి.తిరుపతయ్య, ఏవీ సాల్మన్ రాజు, డా.ఎస్ మన్మథరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


ఉరి వేసుకున్న జగదీష్

గంట్యాడ: ప్రేమించిన యువతి తిరస్కరించిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని కొత్తారుబిల్లి జంక్షన్‌కు చెందిన పారాదిజగదీష్(24) విశాఖపట్నం జిల్లాకు చెందిన ఓయువతిని ప్రేమించాడు. ఆమె తన ప్రేమను అంగీకరించకపోవడంతో కొంతకాలంగా మౌనంగా ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం మిస్‌యు ఆల్ అని స్నేహితులకు స్టేటస్ పెట్టి ఇంటినుంచి వెళ్లిపోయాడు. దీంతో ఈ విషయాన్ని పోలీసులకు తల్లిదండ్రులు చెప్పారు. చుట్టుపక్కల వెతకాలని పోలీసులు చెప్పడంతో జగదీష్ బంధువులు వెతకడం ప్రారంభించారు. మంగళవారం తెల్లవారుజామున కొతారుబిల్లి జంక్షన్‌లో ఉన్న ఆంజనేయస్వామి రోడ్డులో గల మామిడి తోటలో ఉరివేసుకుని చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో మృతుని బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

పాముకాటుకు గురై ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


అర్నిపల్లి సత్యనారాయణ(ఫైల్)

రామభద్రపురం: మండలంలోని నాయుడువలసకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అర్నిపల్లి సత్యనారాయణ(36) గ్రామంలోని మామిడితోటలో ఉపాధి కూలీలు వారం రోజులుగా చేసిన ఉపాధి పనుల కొలతలు వేసేందుకు శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వెళ్తుండగా తోటలో ఆకులు ఎక్కువగా ఉండడంతో ఆకుల కింద పాము ఉందన్న విషయం తెలుసుకోలేక కాలితో మట్టేశాడు. దీంతో ఆకుల కింద ఉన్న పాము కాటు వేయడంతో స్థానికులు మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మృతిచెందాడు. మృతుని భార్య గత రెండేళ్ల క్రితం మృతి చెందింది. పెద్ద పాప జ్యోతి ఇంటర్‌మీడియట్ మొదటి ఏడాది పరీక్షలు రాస్తోంది. రెండవ పాప నిఖిత 7 వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో పిల్లలిద్దరూ దిక్కులేని వారయ్యారు.

జిల్లా పోలీస్ కార్యాలయం మరమ్మతులకు మోక్షం


డీపీఓలో చేపట్టనున్న మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్, చిత్రంలో ఏఆర్ సిబ్బంది

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, ఎస్పీ ఆఫీస్ భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రస్తుత ఎస్పీ వకుల్ జిందల్ చొరవతో దాదాపు రూ.3 లక్షల వ్యయంతో పరిపాలన భవనం మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో చేపడుతున్న పలు అభివృద్ధి, మరమ్మతు పనులను ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం పరిశీలించారు. అభివృద్ధి, మరమ్మతు పనులను నాణ్యంగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. మరమ్మతు పనుల పరిశీలనలో ఎస్పీ వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీపీఓ ఏఓ పి.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాల నాయుడు, ఆర్ఎస్సై వర ప్రసాద్ పాల్గొన్నారు.

15తో ముగియనున్న చెరకు క్రషింగ్

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో చెరకు క్రషింగ్ ఈ నెల 15తో ముగియనుందని యాజమాన్య ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి 3.25లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ చేసినట్టు పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం ప్రాంతాల నుంచి మిగులు చెరకును ఈ నెల 15లోగా కర్మాగారానికి తరలించేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. చెరకు క్రషింగ్‌కు సహకరించిన రైతులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వన్‌ధన్ వికాస కేంద్రాలు వృద్ధి చెందాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని వన్‌ధన్ వికాస కేంద్రాలు వృద్ధి చెందాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో వీడీవీకేల నిర్వహణ, యంత్రాల కొనుగోలుపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీడీవీకేల ఉత్పత్తులు పెంచేందుకు అవసరమైన యంత్ర సామగ్రిని వారికి సమకూర్చి, వాటిపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి, ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్ ఏర్పాటు చేసి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వెలుగు ఏపీడీ, వెలుగు 8మండలాల ఏపీఎంలు, హెడ్‌క్వార్టర్ ఏపీఎంలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


పీ4 సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జీవీ రమణమూర్తి

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు పంచాయతీల్లో ఎన్‌ఆర్ఈజీస్ నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని నర్సిపురం, పెదబొండపల్లి, ఎమ్మార్‌నగరం, తాళ్లబురిడి పంచాయతీలలో ప్రత్యేకాధికారి రమేష్ రామన్‌తో కలసి పర్యటించారు. అలాగే ఆయా పంచాయతీల్లో జరుగుతున్న పీ4 సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాల్లో భాగంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించినట్లు చెప్పారు. పీ4 సర్వేను వేగవంతం చేయాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. తాళ్లబురిడిలో ఇటీవల అంటువ్యాధులకు గ్రామస్తులు పలువురు గురికావడంతో గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలని, తాగునీటి బోర్లు, రక్షిత పథకాల వద్ద క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

హంస వాహనంపై వేంకటేశ్వరస్వామి


ఆలయంలోని కోనేరులో హంసవాహనంపై విహరిస్తున్న వెంకటేశ్వరస్వామి

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో వేంకటేశ్వరస్వామి హంస వాహనంపై విహరించారు. సోమవారం శ్రీనివాసుని కల్యాణం జరిగింది. విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దిన హంస వాహనంలో మంగళవారం సాయంత్రం శ్రీదేవి,భూదేవి సహితంగా స్వామివారు విహరించగా భక్తులు తిలకించారు.